సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 29 । ఆగస్టు । 2023



క్రీడా కుసుమాలు

జిల్లాలో క్రీడలపై ఆసక్తి పెరుగుతుంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో క్రీడాకారులు రాణిస్తున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▸

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ఆదిలాబాద్‌టౌన్: నూతన ఆవిష్కరణలు రూపొందించి విద్యార్థులు భావితర శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా సైన్స్ అధికారి రఘురమణ అన్నారు. పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో సోమవారం జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక మేళా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు వేణుగోపాల్, రాజేశ్వర్, సతీశ్ దేశ్‌పాండే, మధు, నర్సింగ్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'తాంసి'కి ఎన్‌క్వాస్ గుర్తింపు

- 90.64 మార్కులు సాధించిన ఆరోగ్య కేంద్రం



తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తాంసి: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్) గుర్తింపు లభించింది. రోగులకు అందిస్తున్న సేవలు, పరిశుభ్రత విభాగంలో ఎంపికైనట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఈమేరకు ఢిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ కార్యాలయం జాయింట్ సెక్రటరీ విశాల్ చౌహాన్ సోమవారం ప్రకటించినట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. గతంలో ఎన్‌క్వాస్ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోగా ఈ నెల 16,17 తేదీల్లో ఢిల్లీ నుంచి వచ్చిన బృందం సభ్యులు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ అందుతున్న సేవలు, సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించి కేంద్రానికి నివేదిక సమర్పించారు. రాష్ట్రంలోని నాలుగు ఆరోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాస్ గుర్తింపు లభించగా అందులో జిల్లా నుంచి తాంసి ఉండటం విశేషం. మొత్తం 90.64 మార్కులతో తాంసి పీహెచ్‌సీ ఈ గుర్తింపు సాధించింది. ఈ మేరకు మండల వైద్య సిబ్బంది, నాయకులకు తాంసి వైద్యాధికారి శ్రావ్య కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాల కట్టడికి విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సఖి కేంద్రం నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాలు నియంత్రించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పదోతరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఇంటర్‌లో ప్రవేశం పొందాలని, ఫెయిల్ అయిన వారు ప్రత్యేక వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. ఆధార్ కేంద్రాల్లో వయసు మార్పిడికి సరైన ధ్రువపత్రాలు పరిశీలించిన తరువాతనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, లేని పక్షంలో కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, ఆర్డీవో స్రవంతి, పరిశ్రమలశాఖ జీఎంపద్మభూషణ్ రాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, వివిధశాఖలఅధికారులు పాల్గొన్నారు.

ఒక పరిశ్రమకు జిల్లా కమిటీ అనుమతి

అనంతరం జిల్లా స్థాయి పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. టీఎస్–ఐపాస్,టి–ప్రైడ్ కిందవచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది జులైలో టీఎస్– ఐపాస్ ద్వారా ఒక పరిశ్రమకు దరఖాస్తు రాగా జిల్లా కమిటీ అనుమతి మంజూరు చేసిందన్నారు. టి–ప్రైడ్ కింద షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అభ్యర్థులు రవాణా సెక్టర్ కింద ఒక దరఖాస్తు రాగా, రూ.2.63 లక్షల సబ్సిడీ మంజూరు చేసిందన్నారు.

సడలని ఆత్మవిశ్వాసమే.. విజయరహస్యం

- పట్టుదలతో చదివారు.. లక్ష్యం సాధించారు
- శిక్షణ సివిల్ సర్వీసెస్ అధికారుల మనోగతం

వారంతా ఇష్టపడి చదివారు.. పట్టుదలకు అలుపెరగని పోరాటం తోడవడంతో లక్ష్య సాధన సులువైంది.. సడలని ఆత్మ విశ్వాసమే తమను విజయతీరాలకు చేర్చిందని చెబుతున్నారు ఈ శిక్షణ సివిల్ సర్వీసెస్ అధికారులు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వీరు ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. ఇక్కడి ఆదివాసీ జీవన స్థితిగతులు, ఆచార వ్యవహారాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అధ్యయనం చేయనున్నారు. ఈ సందర్భంగా తాము సివిల్ సర్వీస్‌కు ఎంపికైన తీరు తదితర అంశాలపై వారి అభిప్రాయాలను 'సాక్షి'తో సోమవారం పంచుకున్నారు.

– సిరికొండ/గుడిహత్నూర్



రిమ్మ గ్రామంలో వైకుంఠధామంను పరిశీలిస్తున్న ట్రెయినీ అధికారులు

ఇంట్లో చదివి సివిల్ సర్వీసెస్ సాధించా..



సివిల్ సర్వీసు సాధించడానికి లక్షల రూపాయలు ఖర్చుపెట్టాల్సిన అవసరం లేదు. పట్టుదల ఉంటే చాలు. సంబంధిత సిలబస్ అంతా పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది. నేను దాదాపుగా అలానే చదువుకున్నా. రెండో ప్రయత్నంలోనే ఐఆర్ఎస్ సాధించా. మాది పంజాబ్‌లోని లూధియానా. నాన్న ఏఎస్సై, అమ్మ టీచర్. వీరే నాకు ఆదర్శం. సమాజానికి నావంతు కృషి చేయాలని ఈ రంగంలోకి వచ్చా.

– జస్కరణ్ సింగ్, ట్రెయినీ ఐఆర్ఎస్

సాఫ్ట్‌వేర్ వీడి.. సమాజ సేవ కోసం



నాది తమిళనాడులోని మధురై. కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశా. అందులో సంతృప్తి లేక పోవడంతో ఆ జాబ్ వదిలి సివిల్ సర్వీస్‌కు ప్రిపేర్ అయ్యా. అమ్మానాన్న, ఉపాధ్యాయుల ప్రేరణతో నాలుగో ప్రయత్నంలో విజయం దక్కింది. ఐఏఎస్ సాధించా. సమాజ సేవలోనే అసలైన ఆనందం ఉంటుందని నా అభిప్రాయం.

– కావ్య.సి, ట్రెయినీ ఐఏఎస్

నిరాశ చెందలే.. లక్ష్యాన్ని వరువలే



నాది జమ్మూ కశ్మీర్‌లోని జమ్మూ నగరం. నేను కిరణ్ బేడీ నుంచి ప్రేరణ పొంది మూడో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించా. తొలి ప్రయత్నంలో విజయం సాధించకపోయినా నిరాశ చెందలే. లక్ష్యాన్ని మరవలే. సడలని ఆత్మవిశ్వాసం, పట్టుదలే నన్ను విజయ తీరాలకు చేర్చింది.

– నిర్వాంతు హన్స్, ట్రెయినీ ఐపీఎస్

ఇష్టపడి చదివా..



నాది హర్యాణలోని లుధియానా. చదువుకునే రోజుల్లో ఐఎఫ్ఎస్ గురించి తెలుసుకున్నా. ఎలాగైనా సాధించాలని ఇష్టపడి చదివా. మొదటి సారి ప్రయత్నించా. కరోనా బారిన పడి మెయిన్స్ రాయలేకపోయా. తర్వాత ప్రయత్నించి ఫారెస్ట్ సర్వీసుకు ఎంపికయ్యా. అయినా తృప్తి చెందక మళ్లీ ప్రయత్నించి అనుకున్న ఇండియన్ ఫారెన్ సర్వీసు సాధించా. కష్టపడి కాకుండా ఇష్టపడి చేసే పనికి మంచి ఫలితాలు లభిస్తాయని నమ్ముతా.

– స్వర్న్ యాదవ్, ట్రెయినీ ఐఎఫ్ఎస్

నేడే లక్కీ డ్రా

- వాయిదా పడిన మద్యం షాపులకు..
- సోమవారంతో ముగిసిన దరఖాస్తు ప్రక్రియ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో వాయిదా పడిన తొమ్మిది మద్యం షాపులకు సంబంధించి మంగళవారం లక్కీడ్రా నిర్వహించనున్నారు. తక్కువ దరఖాస్తులు వచ్చిన ఈ దుకాణాల కోసం ఎక్సైజ్ అధికారులు రీనోటిఫికేషన్ జారీ చేసిన విషయం విధితమే. ఈ నెల 24న ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. రాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. అయితే ఆశించినస్థాయిలో మాత్రం దరఖాస్తులు రాలేదు. ఇటీవల జరిగిన మద్యం టెండర్లలో పది కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన షాపులను వాయిదా వేశారు. అయితేఈసారి సైతం షాప్ నం.18కి కేవలం 6, షాప్‌నం.40కి 5, షాప్ నం.28, షాప్‌నం.31లకు 8చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

ఉదయం 11 గంటలకు..

వాయిదా పడిన మద్యం షాపులకు కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టర్ రాహుల్ రాజ్ సమక్షంలో లక్కీడ్రా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎక్సైజ్ శాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వాయిదాపడిన దుకాణాల్లో షాప్ నం.18 ఎస్సీ రిజర్వు ఉండగా, షాప్ నం.40 ఎస్టీ రిజర్వులో ఉంది. మిగతా ఏడు షాపులు ఓపెన్ కేటగిరీలో ఉన్నాయి. రిజర్వు కేటాయించిన షాపులు 5 దరఖాస్తులు వచ్చినా టెండర్లు తీసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. అయితే పది కంటే తక్కువ దరఖాస్తులందని వాటిని మాత్రం మరోమారు వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఆ శాఖ అధికారులను సంప్రదించగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. కొత్త షాపులు డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంకా గడువు ఉండడంతో మరోసారి టెండర్లు వేస్తారో.. లేక ఈ షాపులకు డ్రా తీస్తారో మంగళవారం తేలనుంది.

గ్రేడ్.. పెరగనివ్వట్లే!

- విద్యుత్‌శాఖలో కొత్త కాంట్రాక్టర్లపై ఉక్కుపాదం
- పనులు చేయకుండా అడ్డంకులు
- కమీషన్లకే అధికారుల మొగ్గు
- బడా గుత్తేదారులదే హవా

మంచిర్యాలకు చెందిన ఓ నిరుద్యోగి విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్‌గా ఏడాదిన్నర క్రితం లైసెన్స్ పొందాడు. అయితే ఆయన ఇప్పటివరకు తన పేరిట ఒకటంటే ఒక్కపని చేయలేకపోయాడు. జిల్లాలోని వివిధ సెక్షన్లలో కొంత మంది కాంట్రాక్టర్లు 20 ఏళ్ల నుంచి వారే పనులు చేస్తూ కొత్తవారిని దరిదాపులోనికి రానివ్వకపోవడమే కారణంగా తెలుస్తోంది. ఈ ఒక్క సర్కిల్‌లోనే కాదు.. ఉమ్మడి జిల్లాలోని మిగతా సర్కిల్ డివిజన్లలోనూ ఇదే పరిస్థితి.

సాక్షి,ఆదిలాబాద్: విద్యుత్ శాఖలో బడా కాంట్రాక్టర్ల హవా కొనసాగుతోంది. కొత్త కాంట్రాక్టర్లకు పనులు దక్కకుండా వీరు అధికారులతో 'మామూలు' గా వ్యవహరిస్తూ చక్రం తిప్పుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల పలుచోట్ల ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం.

అనధికారికంగా టెండర్లు..?

విద్యుత్‌శాఖ పరంగా చేపట్టే వివిధ పనులను లైసెన్స్‌డ్ కాంట్రాక్టర్ల ద్వారా చేపడుతారు. ఈ క్రమంలో నిరుద్యోగులు వ్యయప్రయాసలకోర్చి తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు నుంచి లైసెన్స్ పొంది ప్రయోజకులుగా మారుదామన్న ప్రయత్నాలు అడియాశలవుతున్నాయి. బడా కాంట్రాక్టర్లు ఈ కొత్త గుత్తేదారులను ఎదగకుండా కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఇలాంటివే అనేకచోట్ల కనబడుతున్నా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అధికంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గ్రేడ్ పెంచుకోవాలన్న కొత్త కాంట్రాక్టర్ల ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ప్రోత్సాహం అందించాల్సిన విద్యుత్‌శాఖ అధికారులు పాత



ఉట్నూర్ విద్యుత్ శాఖ కార్యాలయం

కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి వీరి ఎదుగుదలను అడ్డుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఆదిలాబాద్‌లో ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు సంబంధించి విద్యుత్ పనులు చేపట్టే విషయంలో ఇద్దరు కాంట్రాక్టర్ల మధ్య తలెత్తిన వివాదం అసలు ఆ వర్క్‌కు టెండర్లే చేపట్టకుండా అనధికారికంగా నిర్వహిస్తున్నారన్న విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో విద్యుత్ శాఖలో టెండర్ల బాగోతం కొండంత ఉందన్న విమర్శలు ఉన్నాయి.

ఇదీ పరిస్థితి..

విద్యుత్‌శాఖ పరంగా చేపట్టే పనులను కాంట్రాక్టర్లకు టెండర్ల ద్వారా అప్పగిస్తారు. ప్రధానంగా బోర్డులో లైసెన్సు పొందిన కొత్త కాంట్రాక్టర్‌కు గ్రేడ్–3 కింద రూ.రెండున్నర లక్షల లోపు పనులు అప్పగిస్తారు. ఈ పనులు అనేకం చేపట్టి ఏడాదికి రూ.20లక్షల పైబడి పూర్తి చేస్తే తదుపరి.. బోర్డు నుంచి వారిని గ్రేడ్–2కు గాని, గ్రేడ్–1కి గాని పెంచేందుకు దోహద పడుతుంది. ఈ గ్రేడ్ పెరిగినప్పుడు కొత్త కాంట్రాక్టర్లు రూ.10లక్షలు, రూ.20లక్షలు, ఆపైబడి పనులు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది. అయితే పాత కాంట్రాక్టర్లు కొత్త గుత్తేదారులకు పనులు దక్కకుండా చేయడంతో మంచిర్యాల, కాగజ్‌నగర్, ఉట్నూర్‌లో పరిస్థితి తీవ్రంగా ఉండగా, ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మిగతా డివిజన్లలోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి.

చిన్న పనులు మాయం..

విద్యుత్ శాఖలో చిన్న పనులకు సంబంధించిన ప్యాకేజీలు మాయం అవుతున్నాయన్న విమర్శలున్నాయి. దీని వెనుక బడా కాంట్రాక్టర్ల కుయుక్తులు ఉండగా, విద్యుత్ శాఖలోని ఉన్నతాధికారులు వారికి వంతు పాడుతున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు.. రూ.2లక్షల వర్క్‌కు సంబంధించి టెండర్ల ద్వారా కొత్త కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలి. అయితే ఇలాంటి చిన్న పనులను ఏదైనా పెద్ద ప్యాకేజీలో కలిపేసి బడా కాంట్రాక్టర్లకే దక్కేలా అధికారులు తోడ్పాటనందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి పలు డివిజన్లలో ఉందని పలువురు బాహాటంగానే చెబుతున్నారు.

ఎక్సెస్‌లో పనులు..

సాధారణంగా కాంట్రాక్టర్ల మధ్య పోటీ ఉన్నప్పుడు ఆ వర్క్‌ను దక్కించుకునేందుకు అంచనా వ్యయం కంటే తక్కువలోనే తాము పూర్తి చేస్తామని కొంత మంది కాంట్రాక్టర్లు లెస్‌కే వర్కులను దక్కించుకుంటారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు విద్యుత్ శాఖ డివిజన్‌లలో 5 శాతం ఎక్సెస్‌తో కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడంలో అధికారుల స్వార్థ ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎక్సెస్ నిధులను ఉన్నతాధికారులకు కాంట్రాక్టర్లు కమీషన్‌గా ఇవ్వడం ద్వారా పరస్పర ప్రయోజనాలు పొందుతున్నారు. విద్యుత్ శాఖలో జరుగుతున్న ఈ తతంగాలపై ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఈ విషయంలో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డీఈ సుభాష్‌ను 'సాక్షి' వివరణ కోరేందుకు ఫోన్‌లో యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: టీచర్ల అక్రమ డిప్యూటేషన్లపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు డీఈవో ప్రణీత ఎట్టకేలకు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన నలుగురి డిప్యూటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 'మేమింతే.. మారమంతే..' 'నచ్చినట్లు సర్దుబాటు' శీర్షికన 'సాక్షి'లో ఇటీవల పలు కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈ క్రమంలో స్పందించిన డీఈవో.. స్పోర్ట్స్ స్కూల్‌లో పనిచేస్తున్న నలుగురు ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేసినట్లు వెల్లడించారు. గుడిహత్నూర్ మండలం మన్నూర్ జెడ్పీఎస్ఎస్‌లో పనిచేస్తున్న సవితదేవి, తలమడుగు జెడ్పీఎస్ఎస్‌లో పనిచేస్తున్న ఏ.మురళి, అలాగే రణదీవెనగర్‌లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న టి.శోభారాణి, గాదిగూడ మండలం లోకారిలో పనిచేస్తున్న సీహెచ్ రజనీల డిప్యూటేషన్లను రద్దు చేశారు. వెంటనే వీరిని రిలీవ్ చేయాలని మండల విద్యాధికారులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అలాగే మరికొంత మంది ఓరల్ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారని, వారివి సైతం రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.



PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER ADILABAD

డీఈవో జారీ చేసిన డిప్యూటేషన్ రద్దు ఉత్తర్వు ప్రతి

1న వజ్రోత్సవాల ముగింపు వేడుకలు

- కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న స్వాతంత్య్ర వజ్రోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమానికి జిల్లా నుంచి వెళ్లే వారికి తగు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం హైదరాబాద్ నుంచి ఆయా జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. తొమ్మిదో విడత హరిత హారంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. వృద్ధాప్య, ఆసరా ఫించన్‌దారులు మరణించిన పక్షంలో వారి భాగస్వామికి పింఛన్ బదిలీ చేయాలన్నారు. బీసీ కుల వృత్తుల కింద రెండో విడత రూ.లక్ష ఆర్థిక సాయంను ఆన్‌లైన్‌లోనే మంజూరు చేసేలా చూడాలన్నారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తుల పరిశీలనను పూర్తి చేసి, లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవో స్రవంతి, జెడ్పీ సీఈవో గణపతి, డీఆర్డీవో కిషన్, సంక్షేమ శాఖల అధికారులు రాజలింగు, సునీత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందే అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన పలువురి నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్జీదారులు ఒకే సమస్యపై పదేపదే రాకుండా స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్

స్వీప్ కార్యక్రమంలో భాగంగా 'ఐ వోట్ ఫర్ ష్యూర్' అంశంపై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేకంగా రూపొందించిన టి–షర్ట్‌లను జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు పంపిణీ చేశారు. ప్రతి బుధవారం టి–షర్ట్‌లను ధరించాలని, కార్యాలయాలకు వచ్చే సిబ్బందికి ఓటరు నమోదు, ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ వారిని ఆదేశించారు.

డీఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: డీఈవో ప్రణీతపై ఉపాధ్యాయ జేఏసీ, టీఎస్ యూటీఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వేర్వేరుగా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు, విధాన నిర్ణయాల అములులో డీఈవో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా క్రీడా పాఠశాలలో టీచర్లను డిప్యూటేషన్ కేటాయించారని పేర్కొన్నారు. డీఈవో కార్యాలయంలో ఏఎస్‌వో నియామకమైనప్పటికీ తీసుకోకుండా జాప్యం చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఓరల్ డిప్యూటేషన్లు ఇవ్వడంతో సంబంధిత పాఠశాలల్లో విద్యార్థుల చదువులు కుంటు పడుతున్నాయని పేర్కొన్నారు. పలుమార్లు డీఈవోకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీఈవోపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు ముజఫర్ హుస్సేన్, శ్రీకాంత్, వృకోదర్, శ్రీనివాస్, గోపీకృష్ణ, రామగిరి తదితరులున్నారు.

కదం తొక్కిన ఆదివాసీలు

- ఇంటి పట్టాల కోసం ఆందోళన
- జిల్లా కేంద్రంలో ర్యాలీ.. కలెక్టరేట్ ఎదుట ధర్నా


కైలాస్‌నగర్: మావల మండలం బట్టిసావర్గాం శివారు సర్వేనం.72లో నివాసముంటున్న తమకు జీవో నం.58 ప్రకారం ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఆదివాసీలు సోమవారం కదం తొక్కారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో కుమురంభీం గూడ నుంచి కలెక్టరేట్‌వరకు ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలతో ర్యాలీగా తరలివచ్చారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. అదనపుకలెక్టర్ కుష్బూ గుప్తా, ఆర్డీవో స్రవంతి వారి వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ మాట్లాడుతూ, సొంత ఇళ్లు లేని ఆదివాసీలు కాలనీలో గుడిసెలు వేసుకుని ఏళ్లుగా నివసిస్తున్నారన్నారు. అయితే రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ, విద్యుత్ వంటి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టాలివ్వడంతో పాటు గృహలక్ష్మి పథకం ద్వారా ఆర్థికసాయం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉయిక సంజీవ్, పుర్క బాపురావ్, కుమ్ర శ్యాంరావ్, మనోజ్, రేణుక, ఇంద్రబాయి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఆదివాసీలు

'సీఎం మొండి వైఖరి వీడాలి'

కైలాస్‌నగర్: కాంట్రాక్ట్ ఏఎన్ఎంలపై సీఎం కేసీఆర్ అవలంభిస్తున్న మొండి వైఖరి వీడాలని మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నవీన్ అన్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె సోమవారంతో 13వ రోజుకు చేరింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. వెంటనే ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) నోటిఫికేషన్ రద్దు చేసి కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో నాయకులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కైలాస్‌నగర్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు సోమవారం జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. జిల్లాలోని ఉద్యోగులంతా సామూహికంగా సెలవు ప్రకటించి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా నిర్వహించి తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. సర్వీస్ క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

క్రీడా కుసుమాలు

- జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ
- సత్తాచాటుతున్న క్రీడా పాఠశాల విద్యార్థులు

భారత హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ప్రతీఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించుకుంటారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఆటలపై ఆసక్తి పెంచుకోవడంతో రోజురోజుకు క్రీడలపై ఆదరణ పెరుగుతోంది, ఈ నేపథ్యంలో క్రీడాకారులు జూడో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, మార్షల్ ఆర్ట్స్‌లో తదితర క్రీడల్లో రాణిస్తున్నారు. శిక్షకులు అందిస్తున్న మెలకువలతోపాటు కఠోర సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తాచాటుతున్నారు. పతకాలు సాధిస్తూ ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు. – ఆదిలాబాద్/నిర్మల్‌ఖిల్లా



పరుగు పెడితే పతకమే



పదో తరగతి విద్యార్థిని ఎం.మనీషా పరుగు పెడితే పతకం ఖాయం అన్నట్లుగా మెడల్స్ సాధిస్తోంది. ఇప్పటివరకు దాదాపు ప్రాతినిధ్యం వహించిన ప్రతి ఈవెంట్లో పతకం సాధించింది. నిజామాబాద్‌లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ పోటీల్లో మూడు పతకాలు, రిలే ఈవెంట్లో గోల్డ్, 600, 200 మీటర్ల ఈవెంట్లలో రజత పతకాలతో సత్తా చాటింది. గోల్కొండలో సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అండర్–14లో 2000 మీటర్ల ఈవెంట్లో గోల్డ్ మెడల్ సాధించింది.

రాష్ట్రస్థాయిలో రాణిస్తా



పదో తరగతి చదువుతున్న రేవంత్, ఆకాశ్, లక్ష్మణ్ గతేడాది కామారెడ్డిలో జరిగిన ఓపెన్ బ్యాడ్మింటన్ స్టేట్ మీట్ అండర్–15లో సింగల్, డబుల్స్ ఈవెంట్లకు ప్రాతినిధ్యం వహించాడు. జిల్లాలోని ఖోడాద్‌కు చెందిన క్రీడా పాఠశాల పూర్వ విద్యార్థి అఖిల్ ప్రస్తుతం ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. కామారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించడమే కాక హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో పోటీపడ్డాడు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తానని చెబుతున్నాడు.

ఐపీఎస్ అవుతా..



9వ తరగతి విద్యార్థిని ఎస్.ఆనంది అథ్లెటిక్స్ పోటీల్లో పథకాలు సాధించింది. ఇప్పటివరకు ఐదు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్య వహించగా మూడు పోటీల్లో పతకాలను గెలుచుకుంది. 2022లో హైదరాబాద్ గచ్చిబౌలిలో రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అండర్–14 పోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. ఇటు ఆటల్లో సత్తా చాటుతూనే చదువులోనూ రాణించి ఐపీఎస్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తోంది.

పోటీల్లో మెరిసింది



8వ తరగతిలోనే సహస్ర..జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. కరీంనగర్ జిల్లాకు చెందిన కుమార్–పద్మల కుమార్తె సహస్ర సౌత్‌జోన్ పోటీల్లో పతకం సాధించింది. భోపాల్‌లో నిర్వహించిన రెండవ ఖేలో ఇండియా జాతీయ మహిళల లీగ్ ర్యాంకింగ్ జూడో టోర్నీలో 44 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. కరీంనగర్‌లో 7వ రాష్ట్ర సబ్ జూనియర్ క్రెడిట్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 44 కేజీల విభాగంలో కాంస్య పతకంతో మెరిసింది.

జాతీయస్థాయిలో రాణిస్తా



పదో తరగతి విద్యార్థిని లిప్సిక 2022, అక్టోబర్‌లో ఢిల్లీలో జరిగిన ఆలిండియా ఉమెన్స్ జూడో నేషనల్ లీగ్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 52 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించింది. కేరళలోని త్రిస్సూర్‌లో ఖేలో ఇండియా సౌత్ జోన్ సబ్ జూనియర్ జూడో లీగ్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించింది. కరీంనగర్‌లో జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 57 కేజీల విభాగంలో రజత పతకం గెలుచుకుంది. నిరంతరం సాధన చేస్తూ జాతీయస్థాయిలో రాణిస్తా.

సౌత్ జోన్ పోటీల్లో సత్తా



9వ తరగతి విద్యార్థిని అలేఖ్య జాతీయ, సౌత్ జోన్ స్థాయి పోటీల్లో సత్తా చాటింది. భోపాల్‌లో సెకండ్ ఖేలో ఇండియా నేషనల్ ఉమెన్స్ లీగ్ ర్యాంకింగ్ జూడో టోర్నమెంట్లో 57 కేజీల విభాగానికి ప్రాతినిధ్యం వహించింది. కేరళ త్రిస్సూర్‌లో రెండో ఖేలో ఇండియా ఉమెన్స్ జూడో నేషనల్ లీగ్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 55 కేజీల విభాగంలో రజతం గెలుచుకుంది. కరీంనగర్‌లో రాష్ట్ర సబ్‌జూనియర్ కేడెట్ జూడోచాంపియన్‌షిప్ పోటీల్లో 57 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించింది.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



నిర్మల్‌లోని బుధవార్‌పేట్‌కు చెందిన లావణ్య–అమర్‌కుమార్‌ల కుమార్తె ఏ. శ్రీవల్లి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా ప్రతిభ కనబర్చింది. ఇప్పటికే అండర్–13,–15లో సత్తాచాటింది. అండర్–17 బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్ 10వ ర్యాంక్‌తో దూసుకెళ్తోంది. బ్యాడ్మింటన్‌లో 2028 ఒలంపిక్స్‌లో పతకాన్ని సాధించడమే లక్ష్యమంటోంది.

ఒలింపిక్స్‌లో ఆడుతా..



పదో తరగతి విద్యార్థి అఖిల్ చెన్నైలో జాతీయ సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 60 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించాడు. కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 60 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఒలింపిక్స్‌లో ఆడి పతకం సాధించడమే తన లక్ష్యం.

వరల్డ్ చాంపియన్‌షిప్ లక్ష్యం



ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జుడోకా తరుణ్. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించాడు. చెన్నైలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన జాతీయ సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 50 కేజీల విభాగంలో పోటీపడ్డాడు. కరీంనగర్‌లో జరిగిన 7వ రాష్ట్ర సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 50 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈసారి జరిగే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో చాంపియన్‌షిప్ సాధించడమే తన లక్ష్యం.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ



9వ తరగతి విద్యార్థిని ఐశ్వర్య. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది. గతేడాది డిసెంబర్ కామారెడ్డిలో జరిగిన ఓపెన్ బ్యాడ్మింటన్ స్టేట్ మీట్ అండర్–13 లో డబుల్స్ ఈవెంట్‌లో రజత పతకం సాధించింది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన 9వ రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ మీట్లో సింగల్, డబుల్ ఈవెంట్లలో పోటీపడింది.

పతకమే లక్ష్యం



పదో తరగతి విద్యార్థులు సాయి స్పందన, పూజిత. గతేడాది డిసెంబర్ కామారెడ్డిలో ఓపెన్ బ్యాడ్మింటన్ స్టేట్ మీట్ అండర్ –15 విభాగంలో ప్రాతినిధ్యం వహించారు. హైదరాబాదులో ఇటీవల ఆగస్టులో నిర్వహించిన 9వ రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో సింగల్స్, డబుల్స్ ఈవెంట్లలో ప్రాతినిధ్యం వహించారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించడమే వారి లక్ష్యం.

మార్షల్ ఆర్ట్స్'లో సత్తా



ఇచ్చోడ: మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యూష తన ప్రతభతో జాతీయ స్థాయిలో రాణించి ప్రశంసలు అందుకుంది. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఈమె ఇచ్చోడలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతోంది. గోవా, జమ్మూకశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సత్తాచాటింది.

బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ఇచ్చోడ: గిరిజన విద్యార్థి సుధీర్ బేస్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయిలో రాణించి ప్రతిభచాటాడు. నిర్మల్ జిల్లాలోని పరిమండల్‌కు చెందిన ఈయన..ఐదో తరగతి నుంచి ఇచ్చోడలోని గిరిజన గురుకుల, కళాశాల్లో చదువుతున్నాడు. రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. గతేడాది కేరళలోని కోలాం జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు.

క్రీడల్లో సత్తా



లక్ష్మణచాంద మండలం బాబాపూర్‌కు చెందిన ఎస్.స్థితప్రజ్ఞరెడ్డి..ట్రైనర్ వికాస్ హర్ష శిక్షణలో క్రీడల్లో రాటుదేలాడు. ప్రస్తుతం బ్యాడ్మింటన్ ప్రపంచ జూనియర్ ర్యాంకింగ్స్ 38వ స్థానంలో కొనసాగుతున్నాడు. బల్గేరియన్ జూనియర్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం సాధించాడు. స్పానిష్ ఇంటర్నేషనల్ ప్రపంచ పోటీలు స్పెయిన్‌లో జరగగా ఈ పోటీల్లో సత్తాచాటి సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు.

అమ్మనాన్నల ప్రోత్సాహంతోనే..



దిలావర్‌పూర్‌కు చెందిన గాడి రవళిక. తల్లిదండ్రులు లక్ష్మి–గోపాల్. పాఠశాల స్థాయి నుంచి రవళిక ఖోఖో అంటే ఇష్టం. జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటింది. అమ్మానాన్నలు, పీఈటీ భోజన్న సార్, తోటి సహచర మిత్రులు, సీనియర్ల ప్రోత్సాహంతో ముందుకెళ్తుంది.

జాతీయస్థాయిలో నాలుగు సార్లు..



భైంసాటౌన్: పట్టణంలోని ఉషూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన రాథోడ్ స్వాతి ఉషు క్రీడలో జాతీయస్థాయిలో రాణిస్తోంది. ఇప్పటికే నాలుగు సార్లు జాతీయ స్థాయిలో పాల్గొని మెడల్స్ సాధించింది. ఇటీవలే పోస్టల్ శాఖలో స్పోర్ట్స్ కోటాలో జీడీఎస్‌గా ఉద్యోగం పొందింది. ఓవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు పోటీల్లో పాల్గొంటోంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్‌గా ఎదగడమే తన లక్ష్యమని చెబుతోంది.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా..



హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా తీసుకొని క్రీడాకారులు ఎదగాలి. నచ్చిన క్రీడలో మెలకువలు సాధిస్తూ, నైపుణ్యానికి మరింత పదునుపెట్టాలి. సరైన శిక్షణ పొందితే ప్రతిభ ప్రదర్శించడం కష్టమేమి కాదు.

– కుమ్మరి భోజన్న,
వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి

లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్షతోపాటు, రూ.5 వేల జరిమానా విధిస్తూ నిర్మల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియనాయక్ కథనం ప్రకారం.. నిర్మల్‌రూరల్ మండలానికి చెందిన మహిళ, ఆమె పెద్దమ్మ కుమారుడు బొదసు అనిల్ 2016 ఆగస్టు 27న జిల్లాకేంద్రంలోని తిరుమల టాకీస్‌లో సినిమా చూసి బయటకు వచ్చారు. అదే సమయంలో సోన్ మండలం పాక్‌పట్లకు చెందిన నేరస్తుడు పల్లేపు సాయిలు, స్థానిక గాజులపేట్‌కు చెందిన బాధితురాలి బావ గంగన్న వారిని కలుసుకున్నారు. వీరందరూ ఓ చోట మద్యం తాగారు. ఈ క్రమంలో బాధితురాలిపై సాయిలు లైంగికదాడికి యత్నించగా ప్రతిఘటించింది. బీరుసీసాతో పొడిచే ప్రయత్నం చేశాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో పారిపోయాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నేరస్తుడిని అరెస్టు చేశారు. అప్పటి ఎస్సై సునీల్ కేసు దర్యాప్తు చేపట్టారు. చార్జ్‌షీట్ దాఖలు చేసి కోర్టులో నేరస్తుడిని హాజరుపర్చారు. పీపీ వినోద్‌రావు 12 మంది సాక్షులను ప్రవేశపెట్టి, నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

వాగులో జారిపడి ఒకరి మృతి



యోగేశ్ (ఫైల్)



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నార్నూర్: వాగులో జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మాలేపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రవికిరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాంబ్లె రాజారాం, పంచపూల దంపతులకు నలుగురు కుమారులు. వీరికి గ్రామ సమీపంలో మూడెకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తూ కుటుంబానికి మూడో కుమారుడు యోగేశ్ (17) చేదోడువాదోడుగా ఉన్నాడు. ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో రెండు ఎద్దులు, ఒక ఆవు మేత కోసం బయటకు తీసుకెళ్లాడు. సాయంత్రం 6 గంటల సమయంలో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో వాగులో ఆవును నీటితో కడుగుతుండగా కాలు జారి పడిపోయాడు. కొందరు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. అప్పటికే సమయం దాటడంతో రాత్రి అయింది. సోమవారం గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని బయటకు వెలికితీసినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి రాజారాం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు అస్వస్థత



హాస్టల్‌లో విశ్రాంతి తీసుకుంటున్న విద్యార్థులు

తానూరు: మండలంలోని భోసి బీసీ వసతిగృహం విద్యార్థులు రాత్రి భోజనం వికటించి అస్వస్థతకు గురయ్యారు. బీసీ వసతి గృహం విద్యార్థులకు ఆదివారం రాత్రి చికెన్ వడ్డించారు. సోమవారం ఉదయం తరగతి గదిలో 7 గురికి వాంతులు విరేచనాలు చేసుకున్నారు. హెచ్‌ఎం గంగాధర్ వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అన్నం అరగకపోవడంతో వాంతులు విరేచనాలు చేసుకుని అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు.

నిజాయతీ చాటిన ఉద్యోగి



భక్తురాలికి బంగారు గొలుసు అప్పగిస్తున్న పూజార్లు

భైంసా: బాసర ఆలయ ఉద్యోగి తన నిజాయతీ చాటుకున్నాడు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తురాలు సరస్వతీ అమ్మవారి ఆలయానికి వచ్చింది. దర్శనం తర్వాత తన మెడలో బంగారు గొలుసు పోగొట్టుకుంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న వాగ్దేవి సొసైటీ అధ్యక్షుడు నాగరాజుకు 15 గ్రాముల బంగారు గొలుసు దొరికింది. ఈ విషయాన్ని ఆలయ అధికారులకు చెప్పాడు. భక్తురాలు సైతం తాను గొలుసు పోగొట్టుకున్నట్లు అర్చకుడు మదన్‌పూజారికి తెలిపింది. ఆమె వివరాలు తెలుసుకుని బంగారు గొలుసును తిరిగి అప్పగించారు. నాగరాజు నిజాయతీని పలువురు మెచ్చుకున్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



లోకేశ్వరం: మండలంలోని హద్‌గాం గ్రామానికి చెందిన గర్భిణి 108 అంబులెన్సులో ప్రసవించింది. పూజారి హారికకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు సోమవారం 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి వెళ్లి ఆమెను నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా అర్లి ఎక్స్‌రోడ్డు సమీపంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. వాహనం అక్కడే నిలిపివేసి హారికకు ప్రసవం చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారని ఈఎంటీ శ్రీకాంత్, పైలెట్ సాయికిరణ్ తెలిపారు. వారిని నిర్మల్ ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగులు

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రంలో ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో జీవో నెంబర్ 3ను అమలు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానిక గిరిజనులకు కల్పించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీఎడ్, డీఎడ్ నిరుద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. ఉపాధ్యాయ, గిరిజన సంఘాల నాయకులు ఆత్రం సుగుణ, జగన్, నేతావత్ రాందాస్, బానోత్ రామారావులు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీడీఏలో ఖాళీగా ఉన్న 1800 బ్యాక్‌లాగ్ పోస్టులతోపాటు ఉపాధ్యాయ పోస్టులను స్పెషల్ డీఎస్సీ ద్వారా గిరిజన, ఆదివాసీ నిరుద్యోగులతో వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా, నిరసనలో భాగంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరుద్యోగ సంఘ నాయకులు పి.దీపక్, జె.సుమేశ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్యులపై డైరెక్టర్‌కు ఫిర్యాదు



బాధితుడితో కలిసి డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రూపేష్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: వికలాంగుల సర్టిఫికెట్ల జారీలో రిమ్స్ వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రూపేష్‌రెడ్డి అన్నారు. సోమవారం రిమ్స్ వైద్యులపై డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యం ఉన్న వారికి కాకుండా డబ్బులు ఇచ్చిన వారికి వైద్యులు సర్టిఫికెట్ ఇస్తున్నారని ఆరోపించారు. బేల మండలం దహెగాంకు చెందిన బాలుడు ఎండీ అయాజొద్దీన్‌కు పుట్టుకతో వైకల్యం ఉండగా, మొదటిసారి 40 శాతానికి పైగా, ఆ తర్వాత 61 శాతం, ప్రస్తుతం 30 శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు సర్టిఫికెట్ ఏవిధంగా జారీ చేస్తారని ప్రశ్నించారు. స్పందించిన డైరెక్టర్ విచారణ జరిపించి అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందేలా చూస్తామని హామీఇచ్చారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన నజీర్‌అలీ ఖాన్ గంజాయి విక్రయిస్తుండగా సోమవారం పోలీసులు పట్టుకున్నారు. టూటౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డికి సమాచారం అందగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతని వద్ద నుంచి 90 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ అశోక్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

10 మంది డిబార్

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ దూరవిద్య పరీక్షల్లో 10 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ చేస్తుండగా వారిని పట్టుకుని డిబార్ చేసినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. మొత్తం 262 మంది విద్యార్థులకు గాను 168 మంది పరీక్షకు హాజరవగా, 94 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని నరేందర్ పేర్కొన్నారు.